# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 11 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



మిగతా 4లో..

## గళమెత్తిన రైతులు,కార్మికులు..



మిగతా 3లో..

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది



- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

మిగతా 4లో..

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు



- ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ
- భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి
- హుస్నాబాబ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం

మిగతా 3లో..

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

- కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు





న్యూఢిల్లీ,ఆగస్ట్10 : దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని ల్వీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు.అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

- రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు

హైదరాబాద్, ఆగస్టు 10: తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్ఖై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి



- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
- రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం

మిగతా 4లో..

## సాగర్‌లో ముగిసిన వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు
- వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు





నాగార్జునసాగర్,ఆగస్ట్10 : రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు.

మిగతా 3లో..

## బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు



- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

మిగతా 4లో..

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి



### రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి
### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

హైదరాబాద్,ఆగస్ట్10 : తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు

మిగతా 3లో..

## పెద్ది విగ్రహా విష్కరణను అడ్డుకున్న పోలీసులు



నర్సంపేట,ఆగస్ట్10 : తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రాహావిష్కరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేటలో విగ్రహాన్ని ఏర్పాటుగా చేయగా అక్కడకు చేరుకున్న పోలీసులు విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారు. ప్రైవేట్ భూమిలో విగ్రహం ఏర్పాటు చేసుకుంటే మీకేంటని బీఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు.

## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ, ఆగస్టు 10 : పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న

మిగతా 3లో..

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి



- 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం
- అమెరికా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

మిగతా 4లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'





## ఇంటిపై జాతాయ జెండాను ఆవిష్కరించిన రామచంద్రారవు

హైదరాబాద్, ఆగస్టు 10: 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. సోమవారం తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామని.. పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. లాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి



## ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్య్ర దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్య్ర పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

# మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్



- నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా
- మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 10: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసార్ హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్టను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్టు 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎస్ఐఆర్ పక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్‌లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణయాగం చేస్తే.. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామన్నారు. వానాకాలం అంతా అయిపోయాక రేవంత్ రెడ్డిది ఇదో కొత్త నాటకమంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ఉన్న విషయం సీఎంకు తెలియదా అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

# ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

## హుస్నాబాబ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం



హనుమకొండ,ఆగస్ట్10 : రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధర ణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

- సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి



సంగారెడ్డి,ఆగస్ట్10 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్ంవడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# గుప్తనిధుల పేరుతో మోసగిస్తున్న ముఠా


- నలుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు



హైదరాబాద్,ఆగస్ట్10 : ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయంటూ అమాయకులను నమ్మించి మోసగిస్తున్న ఒక ముఠాను రాజేంద్రనగర్ పోలీసుల భాగస్వామ్యంతో శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. నిందితుల దగ్గరి నుంచి పలు వాహనాలను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ సిటీ శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.రవి వెల్లడించారు.బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన నిందితుడు మహ్మద్ మునావర్‌పై మోసం కేసు నమోదు చేశారు. అతడిది హైదరాబాద్ స్వస్థలం. చదువు పూర్తయిన తర్వాత కార్ల డెంటింగ్, పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, వచ్చే ఆదాయం కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గుప్త నిధుల సేకరణను ఆసరాగా చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఇళ్ల కింద పూడ్చిపెట్టిన గుప్త నిధులను బయటకు తీసే ప్రత్యేక విద్య తనకు వచ్చు అని ప్రచారం చేసుకుంటూ నిందితుడు పలువురిని మోసం చేస్తున్నాడని పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో మునావర్ తన స్నేహితులైన సయ్యద్ అలీ అష్రఫ్, మహ్మద్ హాజీ, మహ్మద్ సల్మాన్‌లను సంప్రదించి తన పథకాన్ని రచించాడని పోలీసులు వెల్లడించారు. అక్రమ మార్గంలో సులభంగా డబ్బు సంపాదించవచ్చని భావించిన వారు కూడా ఇందుకు అంగీకరించారని పోలీసులు చెప్పారు. ఆ తర్వాత, నిందితులు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. తమకు ప్రత్యేక శక్తులు ఉన్నాయని, వారి నివాస స్థలాల కింద భూమిలో గుప్త నిధులు ఉన్నాయని నమ్మించేవారని తెలిపారు. వారు సూచించిన ప్రదేశంలో గుంత తీసిన తర్వాత, ముందే సిద్ధం చేసుకున్న బొగ్గు, నకిలీ బంగారు నాణెలు ఉన్న సంచిని రహస్యంగా అందులో ఉంచేవారని వెల్లడించారు. ఆ తర్వాత, పూజలు చేసి, ఆ బొగ్గు బంగారంగా మారడానికి కొంత సమయం పడుతుందని చెప్పి నిందితులు అక్కడ నుంచి పరారయ్యేవారని చెప్పారు. ఈ ముఠా వివిధ ప్రాంతాల్లో దాదాపు 11 మందిని మోసం చేసిందని అన్నారు. సుమారు రూ. కోటి వరకు వసూలు చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ కె. రవి తెలిపారు.

# ట్రైనీ ఐపిఎస్ కేసును సిబిసిఐడికి బదిలీ చేయాలి

- సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్,ఆగస్ట్10 : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసును సీబీసీఐడీకి బదిలీ చేయాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఈ-మెయిల్ పంపారు.. ఈ కేసును సీబీసీఐడీ లేదా మరో స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టుపై పలు ప్రశ్నలను నాగేశ్వరరావు లేవనెత్తారు. పోష్ చట్టం కింద అంతర్గత విచారణ పూర్తికాకముందే ఉదయ్ కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని నాగేశ్వరరావు ప్రశ్నించారు. అతడిని అరెస్టు చేసే సమయంలో దర్యాప్తునకు సహకరించాడా?, సాక్షులను ప్రభావితం చేస్తాడా?, పరారయ్యే అవకాశముందా? వంటి అంశాలను పరిశీలించారా? అని నిలదీశారు. తొలుత బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుల్లో అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు లేవని ప్రస్తావించారు. కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో తీవ్ర ఆరోపణలు చేర్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా ఉదయ్ కృష్ణారెడ్డిని విచారించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తుపై తలెత్తిన అనుమానాలకు స్వతంత్ర విచారణతోనే తెరపడుతుందని డీజీపీకి సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడి అనుచరుల వీరంగం

## టోల్ చెల్లించకుండా సిబ్బందిపై దాడికి యత్నం

## పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

లక్నో,ఆగస్ట్10 : ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ఎంపీ, గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు ఉమర్ అహ్మద్ అనుచరులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నావాబ్‌గంజ్ టోల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో ప్రయాగ్‌రాజ్ పోలీసులు 28 మందిపై కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొనడం కోసం ఉమర్ తన అనుచరులతో 28 కార్లలో లఖ్‌నవూ నుంచి ప్రయాగ్‌రాజ్ బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున 3.50 గంటల ప్రాంతంలో నావాబ్‌గంజ్ టోల్ ప్లాజా వద్ద ఉమర్ అనుచరులు టోల్ ఫీజు చెల్లించుకుండా వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టోల్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. టోల్ ఫీజు చెల్లించి అక్కడినుంచి వెళ్లమన్నారు. ఆగ్రహానికి గురైన ఉమర్ అనుచరలు హల్‌చల్ చేశారు. టోల్ సిబ్బందితో తప్పుగా ప్రవర్తించారు. అక్కడి నుంచి వెళ్లిపోయే సమయంలో టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేశారు. బూత్ నంబర్ 3 వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. టోల్ ప్లాజా అసిస్టెంట్ మేనేజర్ జైప్రకాశ్ యాదవ్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమర్ అనుచరులు తమను కారుతో తొక్కించి చంపుతామని బెదిరింపులకు దిగినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భయపడిపోయిన టోల్ సిబ్బంది అక్కడినుంచి పక్కకు వచ్చేశారని తెలిపారు. యాదవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు 28 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తాడిపత్రిలో ఉద్రిక్తత..

## ఇరువర్గాల పోటాపోటీ ఆందోళనలు

అనంతపురం,ఆగస్ట్10 : డీఎస్సీలో అక్రమాలపై విచారణ జరిపించాలంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ర్యాలీ కార్యక్రమాన్ని తాడిపత్రిలో పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు జెసి ప్రభాకర్ రెడ్డి ఇంటింటి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఆయన అనుచరులు వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇంటి వద్ద మకాం పెట్టారు. ఇరువర్గాల వారు ఎదురుపడితే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు ఇరువురి కార్యక్రమాలకు అనుమతి నిరాకరించారు. భారీ సంఖ్యలో బలగాలను మోహరింపజేశారు. తాడిపత్రి వైపు వెళుతున్న వాహనాలను తనిఖీ చేసి పంపించారు. ర్యాలీ కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కావలసి ఉండగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రిలో 144 సెక్షన్ విధించినట్లు పోలీసులు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో తిరగడానికి అవకాశం లేదని ఆయన మినహాయిస్తే, ఎవరైనా తాడిపత్రిలో కార్యక్రమాలు చేసుకోవచ్చని జెసి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనేక దౌర్జన్యాలు దుర్మార్గాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జెసి ప్రభాకర్ రెడ్డి స్వేచ్ఛగా తిరిగారని పెద్దారెడ్డి గుర్తు చేశారు. ఇందులో భాగంగానే తాడి పత్రి మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని తెలిపారు. దానివల్ల ప్రభాకర్ రెడ్డి చైర్మన్ అయ్యారని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా హింసను ప్రేరేపించలేదన్నారు. వాహనాల తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఆ అనేక కేసుల్లో ఇరుక్కున్న ప్రభాకర్ రెడ్డి వాటిని ఎదుర్కోలేకపోతున్నారని అన్నారు.

# ఆర్ఎంపి వైద్యుడి వైద్యం

## బాలిక మృతిపై తల్లిదండ్రుల ఆందోళన



ఖమ్మం,ఆగస్ట్10 : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాద ఘటన చోటుచేసుకుంది. జ్వరంతో 8వ తరగతి విద్యార్థిని మృతి చెందింది. వైద్యం వికటించడంతోనే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చల్లా రమేశ్, మౌనిక దంపతుల కుమార్తె (14) స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురికావటంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ చేతికి ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం బాలికకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఈసీజీ నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధరించారు. బాలికకు వైద్యం చేసిన సమయంలో ఆర్ఎంపీ వైద్యుడు మద్యం సేవించి ఉన్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విద్యార్థిని ఆకస్మిక మృతితో బస్వాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా తన కుమార్తె మృతికి ఆర్ఎంపీ వైద్యుడు కారణమని తండ్రి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆర్ఎంపీ వైద్యుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# మీ భూమి- మీ హక్కు పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ



- కేవైసీ అనంతరం మహిళా రైతుకు రాజ ముద్రతో పట్టా దారు పాస్ పుస్తకాన్ని అందించిన సీఎం
- కలిదిండి గ్రామ సభకు హాజరైనట్టు గా రిజిస్టర్‌లో సంతకం

ఏలూరు, ఆగస్టు 10 : కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి-మీ హక్కు పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. మీ భూమి- మీ హక్కు సభలో ఈ కేవైసీ అనంతరం నల్లజెర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాన్ని అందించారు ముఖ్యమంత్రి చంద్ర బాబు.కలిదిండిలో గ్రామ సభకు హాజరైనట్టు గా రిజిస్టర్‌లో సంతకం చేసారు. అనంతరం సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోంది.రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చాం.మీ భూమి- మీ హక్కు దానిపై ఇతరుల పెత్తనం చేయడానికి లేదు. పాస్ పుస్తకాలపై ఇతరులు ఫోటోలు ఎలా వేసుకుంటారు అని గుర్తు చేసారు.2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రికార్డులు ధ్వంసం అయ్యాయి. ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారని గత ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నింటినీ పరిష్కరించాలని నిశ్చ యించుకున్నాం. అంశాల వారీగా వాటిని పరిష్కరిస్తున్నాం.ప్రజల సమస్యలు పరిష్కరించని 151 సీట్లు వచ్చిన వ్యక్తులు ఏమయ్యారో ప్రజలందరికీ తెలుసు.
బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికే యటం చేశారు గత పాలకులు. కానీ ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలు సుకోవాలనే ఈ సమావేశాల ద్వారా తాము ప్రజల్ని కలుస్తున్నాం.కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం.బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం.క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం.32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం.9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు ఇంకా జారీ చేయాల్సి ఉంది 41 వేల ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తప్పించి 1.47 లక్షల మందికి పైగా రైతులకు పట్టాలు ఇచ్చాం అన్న సీఎం ఏలూరు జిల్లాలోనే 5,500 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తీసేసి పట్టాలు ఇచ్చాం అని పేర్కొన్నారు. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించం అని స్పష్టం చేసారు. భూమి తమదైనా వేర్వేరు ఇబ్బందులతో రైతులు, భూ యజమానులు ఇప్పటి వరకూ సమస్యలు ఎదుర్కోన్నారు, ఇక ఆ పరిస్థితి ఉండదని హామీ ఇచ్చారు. లింక్ డాక్యుమెంట్లన్నీ ఆన్ లైన్ ద్వారా అంది స్తాం అన్న ముఖ్యమంత్రి9 లక్షల మందికి ఇప్పటి వరకూ ఆటో మ్యూటేషన్ సౌకర్యం కల్పించాం అని పేర్కొన్నారు.వారసత్వ భూములు రూ.10 లక్షల లోపు విలువ ఉన్న వాటికి కేవలం రూ.100తో బదిలీ చేసుకునేందుకు అవకాశం కల్పించాం అని అన్నారు. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే చేసి ఈకేవైసీ తీసుకున్న తర్వాతే రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తున్నాం అని చెప్పుకొచ్చారు.గ్రామ సభ నిర్వహించి పూర్తి పారదర్శకంగా పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం అంటే రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వ తంగా పరిష్కరించాలన్నదే తమ ఉద్దేశం అని అన్నారు. ఐటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానించి ప్రజలకు సులభంగా పౌరసేవలు అందేలా చర్యలు చేపట్టాం అన్నారు.కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేసినట్లు పేర్కొన్నా ఆయన కుళాయి ద్వారా సురక్షిత మంచినీరు అందించేలా చర్యలు చేపడుతున్నాం అని గుర్తు చేసారు.ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గోతులు పడిన రహదారులను సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు ఆలోచన చేస్తున్నాం అన్నారు.గత పాలన తాలూకు విధ్వంసపు గడ్డు రోజులను అధిగమించి క్రమంగా అభివృద్ధివైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం అన్న సీఎం2019-24 మధ్య రాష్ట్రం ఆర్ధికంగా ధ్వంసమైంది, ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధం లాంటి పరిస్థితులు ఆక్వా రంగాన్ని దెబ్బతీ శాయి.కానీ కూటమి వచ్చాక ఆక్వాకు రూ.1.50 కు యూనిట్ చొప్పున రాయితీ విద్యుత్ ను జోన్ తో నిమిత్తం లేకుండా ఇస్తున్నాం.ప్రభుత్వానికి రూ.1150 కోట్ల అదనపు భారం పడుతుంది. దేశానికి ఆదాయం వచ్చేలా చేస్తున్న రైతుల కోసం దీనిని భరిస్తున్నాం.నాన్ ఆక్వా జోన్ పరిధిలోని 12,500 మంది రైతులకు కూడా కొత్తగా ఈ రాయితీ విద్యుత్ అమలు అవుతుంది అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు.





# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 10: తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవ ర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలు గుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరి ంచనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుక బడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీ యాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగ ణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరు లకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహే ష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచిం చారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.



# కొంపముంచిన రైతు అతి జాగ్రత్త


- పొలంలో దాచిన నోట్లకట్టలకు చెద
- పనికిరాకుండా పోయిన 5లక్షల నగదు

జైపూర్,ఆగస్ట్1 : రాజస్థాన్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో వాళ్లకు తెలియకుండా డబ్బును దాచే ప్రయత్నంలో ఓ రైతు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసమని దాచిన సొమ్ము మట్టిపాలు కావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో కూరుకుపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పచ్‌పాద్రాకు చెందిన రైతు మంగీలాల్ మేఘ్వాల్ ఏడాది క్రితం కొంత జాగాను విక్రయించగా రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుతో చిన్న ఇంటిని నిర్మించుకోవాలని మేఘ్వాల్ భావించాడు. అయితే, ఇంత నగదును ఇంట్లో పెడితే ఎవరైనా చోరీ చేసే ప్రమాదం ఉందని భయపడ్డాడు. ఇంట్లో వాళ్లు చేసే వృథా ఖర్చులతో డబ్బు తరిగిపోయే ప్రమాదం ఉందని కూడా అనుకున్నాడు. డబ్బును ఎలా జాగ్రత్త చేయాలా? అని తెగ ఆలోచించిన అతడికి పొలంలో డబ్బును పాతిపెడితే ఎలాంటి ఇబ్బందీ ఉండదని అనిపించింది. దీంతో, ఓ రోజు రాత్రి అతడు కుటుంబసభ్యులకు తెలియకుండా పొలానికి వెళ్లాడు. రూ.5 లక్షలను పాలిథీన్ బ్యాగ్‌లో చుట్టి పొలంలో పాతిపెట్టాడు. ఆ తరువాత కొంతకాలానికి మళ్లీ డబ్బు అవసరం పడింది. కానీ ఆ డబ్బును పాతిపెట్టిన చోటును రైతు మర్చిపోవడంతో చిక్కులు ఎదురయ్యాయి. ఎంత ఆలోచించినా ఆ ప్రదేశం ఏదో గుర్తుకురాలేదు. పొలంలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పగా వారు పొలంలో వెతికి చివరకు నిరాశగా వెనుదిరిగారు. ఇటీవల వర్షాలు పడటంతో ఆ కుటుంబం వ్యవసాయానికి సిద్ధమైంది. ఈ క్రమంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతుండగా డబ్బు కట్టలున్న బ్యాగు బయటపడింది. అయితే, నోట్లకు చెదలు పట్టి చాలా వరకూ పాడైపోవడంతో వారంతా హతాశులయ్యారు. చివరి ప్రయత్నంగా పాత నోట్లను బ్యాంకులో ఇచ్చి కొత్త నోట్లను తెచ్చుకోవాలని ప్రయత్నించారు. అయితే, నోట్లు బాగా పాడైపోవడంతో పచ్‌పాద్రా, బలోత్రాలోని బ్యాంకులు తిరస్కరించాయి. జైపూర్‌లోని బ్యాంకులను సంప్రదించాలని సూచించాయి. డబ్బులో కొంతమొత్తమైనా తిరిగొస్తే బాగుండని రైతు మంగీలాల్ ఆశిస్తున్నాడు. పొలంలో డబ్బు పాతిపెట్టకుండా ఉంటే బాగుండేదని పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు.

# రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ



## ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్,ఆగస్ట్10 : భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలపధాన కార్య దర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు.అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర, బి. పాపిరెడ్డి, లా సెక్రటరీ, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్, మహేష్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్, స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీఇకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటిఆర్ వెల్లడి

నర్సంపేట,ఆగస్ట్10 :ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తే తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.










# చిన్నారుల వ్యాక్సిన్ మార్గదర్శకాలపై ట్రంప్ సంచలన నిర్ణయం!



### ఒకేసారి కాకుండా విడతలవారీగా టీకాలు ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్.. నిపుణుల తీవ్ర ఆందోళన

బలగం టీవీ, హైదరాబాద్

చిన్నారుల వ్యాక్సినేషన్ విధానంలో కీలక మార్పులు తీసుకొచ్చేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. పిల్లలకు ఒకేసారి కాకుండా వేర్వేరు సమయాల్లో (స్పేసింగ్ అవుట్) విడతలవారీగా టీకాలు ఇవ్వాలనే తన సుదీర్ఘ నమ్మకానికి అనుగుణంగా నూతన మార్గదర్శకాలను ప్రతిపాదించారు.

వివరాల్లోకి వెళ్తే...

MMR వ్యాక్సిన్‌ను మూడు డోసులుగా విడగొట్టాలి!

వైట్‌హౌస్ విడుదల చేసిన వివరాల ప్రకారం— ప్రస్తుతం ఒకేసారి ఇచ్చే తట్టు, అమ్మవారు, రూబెల్లా (MMR) వ్యాక్సిన్‌ను మూడు వేర్వేరు డాక్టర్ విజిట్లలో, మూడు విడివిడి డోసులుగా ఇవ్వాలని ఈ ఉత్తర్వు రికమండ్ చేస్తోంది. ఓవల్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఏడాది వయసున్న పిల్లలకు ఇచ్చే టీకాలను ఐదు వేర్వేరు విజిట్లలో ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అమెరికాలో MMR కు సంబంధించి వేర్వేరు సింగిల్ వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ఆరోగ్య నిపుణుల ఆందోళన

టీకాల మధ్య ఎక్కువ వ్యవధి ఇవ్వడం వల్ల చిన్నారులు టీకాల ద్వారా నయమయ్యే ప్రమాదకర వ్యాధుల బారిన పడే ముప్పు పెరుగుతుందని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారుల వ్యాక్సిన్లను ఎప్పుడు, ఎలా కలిపి ఇవ్వాలనే దానిపై ఏళ్ల తరబడి శాస్త్రీయ అధ్యయనాలు, పరిశోధనలు జరిగాయని గుర్తుచేస్తున్నారు. విద్యాసంస్థల్లో వ్యాక్సిన్ నిబంధనలు విధించే అధికారం కేంద్రానికి కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉన్నందున, రాష్ట్రాలు తమ చట్టాలను సవరించుకోవాలని ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ సూచిస్తోంది.

ఆటిజం - వ్యాక్సిన్ల వివాదం

మరోవైపు వ్యాక్సిన్లకు, ఆటిజం (అభ్యాస వైకల్యం) సమస్యకు సంబంధం ఉందనే విషయాన్ని ట్రంప్ మళ్లీ తెరపైకి తెచ్చారు. ఆటిజం వ్యాప్తికి గల కారణాలను త్వరగా గుర్తించాలని హెల్త్ సెక్రటరీ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్‌పై ఆయన ఒత్తిడి పెంచుతున్నారు. అయితే, చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్లకు, ఆటిజంకు ఎలాంటి సంబంధం లేదని దశాబ్దాల శాస్త్రీయ పరిశోధనలు, అంతర్జాతీయ నిపుణులు ఇప్పటికే తేల్చిచెప్పారు. అమెరికాలో ప్రస్తుతం తట్టు (మీజిల్స్) కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది

# వెనక్కి తగ్గుతున్న ట్రంప్ సర్కార్?



### హోర్ముజ్ జలసంధి తెరిస్తే చాలు.. ముగింపునకు అమెరికా మొగ్గు? 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఆసక్తికర కథనం

బలగం టీవీ, హైదరాబాద్

ఇరాన్‌ను అణ్వాయుధాలు తయారుచేయకుండా అడ్డుకుంటామనే నెపంతో ఆ దేశంతో యుద్ధానికి దిగిన అమెరికా, ఇప్పుడు ఆ యుద్ధ ఖర్చులు భరించలేక బయటపడే మార్గాల కోసం అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌లోని అణు కేంద్రాలన్నింటినీ శాశ్వతంగా మూసివేసి, అణ్వాయుధాలు తయారు చేయబోమని తమతో ఒప్పందం చేసుకోవాలని తీవ్ర ఒత్తిడి తెచ్చిన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు తన పట్టు సడలించినట్లు సమాచారం.

వివరాల్లోకి వెళ్తే...

అణు ఒప్పందం పక్కనపెట్టి 'విజయం' ప్రకటన?

'వాల్‌స్ట్రీట్ జర్నల్' ప్రచురించిన కథనం ప్రకారం— అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై అణు ఒప్పందం కోసం ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను పక్కనపెట్టే యోచనలో ఉన్నారు. దానికి బదులుగా, అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకల కోసం ఇరాన్ పూర్తిగా పునరుద్ధరిస్తే, దాన్ని నెపంగా చూపి యుద్ధానికి ముగింపు పలకాలని అమెరికా యంత్రాంగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అణు సమస్యను తాత్కాలికంగా పక్కనపెట్టి, జలసంధి పునరుద్ధరణనే తమ విజయాంశంగా ప్రకటించుకోవడానికి వైట్‌హౌస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అమెరికాను కట్టడి చేస్తున్న ఇరాన్ కఠిన షరతులు

మరోవైపు ఈ యుద్ధానికి గౌరవప్రదమైన ముగింపు పలకడం అమెరికాకు అంత సులభంగా కనిపించడం లేదు. ఇరాన్ తన ముందు భారీ డిమాండ్లను ఉంచడమే దీనికి కారణం.

వందల కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలి.

అమెరికా నౌకాదళం విధించిన దిగ్బంధనాన్ని వెంటనే తొలగించాలి.

ఆ ప్రాంతం నుంచి అమెరికా బలగాలను సంపూర్ణంగా ఉపసంహరించుకోవాలి.

ఈ విధమైన కీలక రాయితీలను ఇరాన్ డిమాండ్ చేస్తుండటంతో అమెరికాకు దౌత్యపరమైన అవకాశాలు పూర్తిగా పరిమితమయ్యాయి. యుద్ధం కొనసాగించలేక, ఇరాన్ షరతులకు పూర్తిగా తలొగ్గలేక ట్రంప్ ప్రభుత్వం తీవ్ర సతమతమవుతోంది

# రష్యాపై ఉక్రెయిన్ భీకర డ్రోన్ దాడి

### 12 మంది మృతి, 39 మందికి గాయాలు! సరిహద్దుకు 1,000 కి.మీ దూరంలోని చమురు నగరంపై విరుచుకుపడిన డ్రోన్లు.. ప్రతీకార దాడులతో రష్యా భగ్గు!

బలగం టీవీ, హైదరాబాద్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నాలుగో ఏట కూడా అత్యంత తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ పోరు ప్రారంభమైన తర్వాత రష్యా భూభాగంలో ఒకేసారి అత్యధిక ప్రాణనష్టం కలిగించిన అతిపెద్ద డ్రోన్ దాడి సోమవారం చోటుచేసుకుంది. సెంట్రల్ రష్యాలోని టాటార్‌స్తాన్ పరిధిలో ఉన్న నినేకామ్స్క్ (Nizhnekamsk) పట్టణంపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ల దాడిలో ఏకంగా 12 మంది మరణించగా, మరో 39 మంది తీవ్రంగా గాయపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే...

సరిహద్దుకు 1,000 కి.మీ దూరంలో చమురు రిఫైనరీలపై దాడి

ఉక్రెయిన్ సరిహద్దుకు సుమారు 1,000 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న నినేకామ్స్క్ పట్టణం రష్యాకు కీలకమైన ఇంధన, సహజ వనరుల కేంద్రంగా ఉంది. ఇక్కడ అనేక చమురు రిఫైనరీలు, పెట్రోకెమికల్ ప్లాంట్లు నెలకొని ఉన్నాయి. సోమవారం ఉదయం ఈ పారిశ్రామిక ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడటంతో భారీ పేలుడు సంభవించి దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తీవ్ర కలకలం రేపాయి.

రష్యా ప్రతిదాడి.. ఖార్కివ్‌లో నలుగురు పౌరుల మృతి

ఈ దాడికి బదులుగా రష్యా బలగాలు కూడా వెంటనే ప్రతీకార దాడులకు దిగాయి. ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ ప్రాంతం, చుగివ్ జిల్లా పరిధిలోని బుగైవిక గ్రామంపై రష్యా జరిపిన దాడిలో అనేక నివాస గృహాలు ధ్వంసమవ్వడమే కాకుండా నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధికారులు ధృవీకరించారు.

456 డ్రోన్లను కూల్చివేశామన్న రష్యా

మరోవైపు రష్యా భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ రాత్రికి రాత్రే ప్రయోగించిన 456



డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు విజయవంతంగా కూల్చివేసాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో మరణించిన వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు స్థానిక వర్గాలు తెలిపాయి.

గత నాలుగేళ్లుగా సాగుతున్న ఈ పోరాటంలో ఇరుదేశాల ఆర్మీ స్థావరాలతో పాటు ఇంధన వనరులు, పౌర నివాస ప్రాంతాలు కూడా దాడులకు గురవుతుండటంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఉక్రెయిన్ సుదూర ప్రాంతాలకు చేరుకోగల డ్రోన్ సాంకేతికతను పెంచుకోవడం రష్యా భద్రతా వర్గాలకు సవాలుగా మారింది.

# చైనాపై 'డాల్ఫిన్' దాడి



### జెజియాంగ్‌లో తీరం దాటిన భీకర తుపాను! రెడ్ అలర్ట్ జారీ.. 2,700కు పైగా విమానాలు రద్దు, సురక్షిత ప్రాంతాలకు లక్షలాది మంది తరలింపు

బలగం టీవీ, హైదరాబాద్

శక్తివంతమైన 'డాల్ఫిన్' తుపాను చైనా తూర్పు తీరాన్ని గజగజలాడిస్తోంది. ఈ ఏడాది చైనాను తాకిన తుపానుల్లో 13వదైన డాల్ఫిన్, ఆదివారం సాయంత్రం జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ (యూహువాన్) వద్ద తీరం దాటింది. తీరం దాటే సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో (సెకనుకు 42 మీటర్లు) ఈదురుగాలులు వీచడంతో చైనా జాతీయ వాతావరణ కేంద్రం అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది.

వివరాల్లోకి వెళ్తే...

స్తంభించిన విమాన సర్వీసులు

తుపాను భీభత్సం కారణంగా దేశంలోని రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ముఖ్యంగా వాణిజ్య రాజధాని షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో దాదాపు 2,230కి పైగా సర్వీసులు రద్దయ్యాయి. ఇందులో సోమవారం రాత్రి వరకు రద్దయిన 720 విమానాలు కూడా ఉన్నాయి. మరోవైపు జెజియాంగ్ రాజధాని హాంగ్‌జావ్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించాల్సిన 500 విమానాలను అధికారులు రద్దు చేశారు.

లక్షలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

జెజియాంగ్, ఫుజియాన్ ప్రావిన్స్‌ల తీరప్రాంతాల్లో తుపాను ముప్పు ఎక్కువగా ఉండటంతో లక్షలాది మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలు, తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. వెన్‌జౌ, తైజౌ నగరాల్లో అత్యవసర సహాయక చర్యలను ముమ్మరం చేశారు. సహాయక బృందాలు వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీస్తుండగా, వీధుల్లో కూలిపోయిన చెట్లను తొలగించే పనులు చేపట్టాయి.

భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ముప్పు!

తుపాను ప్రభావంతో జెజియాంగ్‌తో పాటు షాంఘై, మిగతా పొరుగు ప్రావిన్స్‌లలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. పర్వత ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుపాను క్రమంగా వాయువ్య దిశగా పయనిస్తూ బలహీనపడుతున్నప్పటికీ వర్షాల తీవ్రత కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.





# యుఎన్ ప్రాంగణంలో భారతీయ నెమళ్ల సందడి!

### ఐక్యరాజ్యసమితి జెనీవా కార్యాలయానికి 5 మయూరాలను బహూకరించిన భారత్.. దశాబ్దాల సంప్రదాయానికి పునరుజ్జీవం!

బలగం టీవీ, హైదరాబాద్

మన జాతీయ పక్షి నెమలి ఇక స్విట్జర్లాండ్‌లోని ఐక్యరాజ్యసమితి జెనీవా కార్యాలయ (UNOG) ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక సంప్రదాయానికి పునరుజ్జీవం కల్పిస్తూ భారత్ ఐదు భారతీయ నెమళ్లను ఐక్యరాజ్యసమితికి బహూకరించింది. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత ప్రతినిధి అరిందమ్ బాగ్చీ ఈ నెమళ్లను UNOG డైరెక్టర్ జనరల్ టాటియానా వలోవాయాకు అధికారికంగా అందజేశారు.

వివరాల్లోకి వెళ్తే...

నీలం, తెలుపు రంగుల్లో 'భారత' కానుక

భారత్ అందజేసిన ఈ ఐదు మయూరాలలో నాలుగు నీలి రంగు నెమళ్లు కాగా, ఒకటి అత్యంత అరుదైన తెల్లని ఈకలు కలిగిన మగ నెమలి కావడం విశేషం. ఐక్యరాజ్యసమితి జెండాకు ప్రతీకగా నిలిచే నీలం, తెలుపు రంగులను ప్రతిబింబించేలా వీటిని ఎంపిక చేసి అందించారు. ఈ కానుక భారత ప్రకృతి వైభవంతో పాటు జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల దేశ నిబద్ధతను, భారత్-యూఎన్ మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను ప్రతిబింబిస్తుందని జెనీవాలోని భారత మిషన్ తెలిపింది.

కృతజ్ఞతలు తెలిపిన ఐక్యరాజ్యసమితి

భారత్ పంపిన ప్రత్యేక కానుకపై UNOG డైరెక్టర్ జనరల్ టాటియానా వలోవాయా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇది 19వ శతాబ్దం నాటి చారిత్రక సంప్రదాయానికి గౌరవ సూచకమని పేర్కొన్నారు. జెనీవా బయోపార్క్ జూ డైరెక్టర్ టోబియాస్ బ్లాహా, యూఎన్ సిబ్బందితో కలిసి ఈ నెమళ్ల సంరక్షణ బాధ్యతలను పర్యవేక్షించనున్నారు.

45 సంవత్సరాల తర్వాత పునరావృతం!

ఐక్యరాజ్యసమితి జెనీవా కార్యాలయానికి భారత్ నెమళ్లను బహూకరించడం ఇదే మొదటిసారి కాదు. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దిల్లీ జూ నుంచి ఒక జత నెమళ్లను జెనీవాకు పంపించారు. మళ్లీ 45 సంవత్సరాల తర్వాత భారత్ నుంచి నెమళ్లు జెనీవాకు చేరాయి. మొదట ఈ ఐదు నెమళ్లను మూడు నెలల పాటు ప్రత్యేక రక్షిత ప్రదేశంలో ఉంచిన అనంతరం, అరియానా పార్కులో స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతిస్తారు.

శతాబ్దానికి పైగా కొనసాగుతున్న చరిత్ర

జెనీవాలోని 46 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న అరియానా పార్క్‌ను మొదట 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు, ఆ తర్వాత ఐక్యరాజ్యసమితికి అందించారు. 1890లో స్విస్ పురావస్తు శాస్త్రవేత్త గుస్తావ్ రెవిలియోడ్ తన ఎస్టేట్‌ను జెనీవా నగరానికి అందించినప్పటి నుంచే అక్కడ నెమళ్లు పెంచే సంప్రదాయం ప్రారంభమైంది. 1997లో జపాన్ జూ ఇచ్చిన నెమళ్లు ప్రస్తుతం అక్కడ ఉన్నాయి. ఇప్పుడు భారత్ నుంచి వెళ్లిన ఈ ఐదు మయూరాలు కూడా ఆ గుంపులో చేరి ఐక్యరాజ్యసమితి ప్రాంగణంలో భారత్ పర్యావరణ ప్రాధాన్యతను చాటనున్నాయి.



# బీసీ మహిళల ఐక్యతతోనే అభివృద్ధి..

### - వేములవాడలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా వార్డు కమిటీల ఎన్నిక..

బలగం టీవీ వేములవాడ:

పట్టణంలోని వివిధ వార్డుల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం బీసీ మహిళా వార్డు కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం వేములవాడ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు చందగిరి అఖిల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన వార్డు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ బీసీ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగడానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీసీ మహిళల హక్కులు, సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి వార్డులో బీసీ మహిళలను సంఘటితం చేసి వారి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గడ్డం నరేష్, జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, జిల్లా నాయకులు మారావేణి మహేష్, బాధ పోచవ్వ, కోరేపు మమత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ నివారణకు ప్రజలందరూ సహకరించాలి..

### - ఇల్లంతకుంట సర్పంచ్ యం. రాజు

బలగం టీవీ, ఇల్లంతకుంట:



సుప్రీంకోర్టు తీర్పు 2026 నిబంధనల ప్రకారం ప్రజారోగ్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆగస్టు 15వ తేదీ నుంచి ఇల్లంతకుంట గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ M.రాజు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను అరికట్టి, పరిశుభ్రమైన వాతావరణాన్ని గ్రామ ప్రజలకు అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ M.రాజు గారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాలు, డ్రైనేజీలలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తే రూ.2,500 జరిమానా, వర్తక, వ్యాపార సముదాయాల ముందు చెత్త వేస్తే రూ.5,000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే రూ.25,000 జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నివారించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

గ్రామ ప్రజలందరూ కూడా కూరగాయాలు &మాంసం కోనుగోలు కోసం వెళ్లినపుడు టిఫిన్ డబ్బాలు వాడలని సూచించారు.120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ స్పూన్లు, ఫోర్కులు, స్ట్రాలు, కప్పులు, ప్లేట్లు, థర్మోకోల్ అలంకరణ వస్తువులు, ప్లాస్టిక్ జెండాలు తదితర ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించాలని సూచించారు.

నాలుగు రకాల డస్ట్‌బిన్ల పంపిణీ..

గ్రామంలో చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, ప్రత్యేక చెత్తగా వేరు చేసేందుకు ప్రతి కుటుంబానికి నాలుగు రకాల డస్ట్‌బిన్లు అందించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రతి కుటుంబం చెత్తను వేర్వేరుగా సేకరించి, గ్రామపంచాయతీ చెత్త బండి వచ్చినప్పుడు ఆయా డస్ట్‌బిన్లలోని చెత్తను అందించాలని సూచించారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ప్రతి కుటుంబం విధిగా తమ ఇంటి ముందుకు వచ్చే గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో మాత్రమే వేయాలని కోరారు.

ప్రజల సహకారంతో ఇల్లంతకుంటను పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### అంతరిక్షం నుంచి భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు! త్రివర్ణ పతాకంతో రష్యా వ్యోమగాముల సందేశం.. భారత్–రష్యా మైత్రిపై ప్రశంసలు

బలగం టీవీ, హైదరాబాద్

భారత్–రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధానికి మరో అరుదైన ఉదాహరణ చోటుచేసుకుంది. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రష్యాకు చెందిన ముగ్గురు వ్యోమగాములు అంతరిక్షం నుంచి భారతీయులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత త్రివర్ణ పతాకాన్ని చేబూని వారు పంపిన వీడియో సందేశం ఆకట్టుకుంది.రష్యా వ్యోమగాములు పాట్ర్ డుబ్రోవ్, ఆండ్రే ఫెడేవ్, అన్నా కికినా ఈ సందేశాన్ని పంపించారు. అంతరిక్షం నుంచి భారత్ ఎంతో అందంగా కనిపిస్తోందని వారు ప్రశంసించారు. భారత్–రష్యా మధ్య స్నేహం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.అంతరిక్షంలోకి వెళ్లిన తొలి మానవుడు యూరి గగారిన్ చారిత్రక యాత్ర చేసి 65 ఏళ్లు పూర్తయిన విషయాన్ని కూడా వ్యోమగాములు ప్రస్తావించారు. గగారిన్ భారత్‌లో పర్యటించిన విషయాన్ని గుర్తుచేశారు.

# విహారానికి వస్తే.. భద్రత మరవొద్దు

**-సరదా విషాదం కావొద్దు..**
**పర్యాటకులుఅప్రమత్తంగా ఉండాలి..**
**-ఎస్పీ మహేష్ బి. గితే**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

మిడ్ మానేరు బ్యాక్‌వాటర్ అందాలను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులు భద్రతను ఏమాత్రం విస్మరించవద్దని, విహారయాత్ర సరదాగా సాగాలే తప్ప,చిన్న నిర్లక్ష్యం కారణంగా విషాదంగా మారకూడదని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.

తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మానేరు బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని సోమవారం ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. పర్యాటకుల రద్దీ, భద్రత కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బ్యాక్‌వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి పర్యాటకులు ఆయా ప్రాంతాల్లోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రమాదకర ప్రదేశాల్లోకి వెళ్లి ప్రాణాలను పణంగా పెట్టవద్దని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే పర్యాటక ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# క్రషర్, రైస్‌మిల్ నిర్వాహకులకు బెదిరింపులు..

## -రూ.30 లక్షలు డిమాండ్.. ఇద్దరు అరెస్ట్

### -ఎస్పీ మహేష్ బి. గితే



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

వ్యాపారులను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు యత్నించిన ఇద్దరిని వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని,నిందితుల నుంచి రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ వేములవాడ పట్టణానికి చెందిన దండు వినోద్ (33), నాంపల్లికి చెందిన పెద్దిగారి అమరగొండ అజయ్ (27) కలిసి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 9న అగ్రహారం శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్ లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని బెదిరించి రూ.20 లక్షలు డిమాండ్ చేశారని, భయపడిన గురవయ్య రూ.50 వేల నగదు తీసుకువచ్చి నిందితులకు అందజేశారని తెలిపారు.

అలాగే వేములవాడకు చెందిన రైస్ మిల్ నిర్వాహకుడు బండ మల్లేశంను కూడా బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను సాయినగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. బెదిరింపులు, అసత్య ప్రచారాలు, అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పెగ్గు పేరుతో పిలిచి.. ప్రాణం తీశాడు!



**-వెంకటేశం మృతి కేసులో నిందితుడు కుసుమ గణేష్ అరెస్ట్**
**-సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించిన పోలీసులు.. -మరో నలుగురి పాత్రపై ఆరా**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

చేనేత కార్మికుడు వెంగల వెంకటేశం (50) మృతి కేసులో మిస్టరీ వీడింది. మద్యంలో విషపదార్థం కలిపి తాగించి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో బీవై నగర్‌కు చెందిన కుసుమ గణేష్ (51)ను అరెస్ట్ చేశారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి తెలిపిన వివరాల ప్రకారం.

వ్యక్తిగత విభేదాలతో పాటు రాజకీయ పరిణామాలను తనకు అనుకూలంగా మలుచుకునేందుకు హత్యకు పథకం వేసినట్లు నిందితుడు విచారణలో వెల్లడించినట్టు తెలిపారు.

వెంకటేశం ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య సులోచన పోలీసులకు ఫిర్యాదు మేరకు, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టామని,8న రగుడు శివారు ప్రాంతంలో వెంకటేశం మృతదేహం లభించడంతో అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తును ముమ్మరం చేశామని అన్నారు.సీసీ కెమెరాలలో వెంకటేశం చివరిసారిగా కుసుమ గణేష్‌తో కలిసి తిరిగినట్లు గుర్తించమని,నమ్మదగిన సమాచారంతో ఎల్లమ్మచౌక్ వద్ద గణేష్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.వెంకటేశం తన వద్ద పనిచేస్తూ తరచూ పనికి గైర్హాజరవుతున్నాడని, ఈ విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని ఈ కారణంగా వెంకటేశాన్ని తొలగించుకోవాలని నిర్ణయించుకున్నడని అన్నారు.ఇంట్లో ఉన్న నైట్రాప్ పొడిని ఎంసీ విస్కీలో కలిపి, మరో మద్యం బాటిల్, నీటి ప్యాకెట్లతో కలిసి రగుడు శివారుకు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ వెంకటేశంతో విషం కలిపిన మద్యం తాగించగా కొద్దిసేపటికే కిందపడిపోయాడని, మృతి చెందాడని భావించి అక్కడి నుంచి వెళ్లిపోయాడనిఅన్నారు .ఇందిరమ్మ ఇల్లు మంజూరు వ్యవహారంలో దార్ల సందీప్‌పై గతంలో నమోదైన కేసును ఉపయోగించుకుని వెంకటేశం మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించాలని గణేష్ భావించినట్లు తెలిపారు. అలాగే లక్ష్మణ్, దార్ల సందీప్ మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో కేసులో రాజకీయ కోణంపైనా దర్యాప్తు చేస్తున్నమని,లక్ష్మణ్, పోసు రమేష్, పసునూరి సూర్యప్రకాశ్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి పాత్రపై విచారణ కొనసాగిస్తున్నామని అన్నారు.కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు బి. రవికుమార్, ఎన్. శ్రీనివాస్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఇల్లంతకుంట సర్పంచ్ యం .రాజు**



బలగం, టీవీ ఇల్లంతకుంట

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ M.రాజు తెలిపారు. గ్రామంలోని అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు పెన్షన్ కోసం అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

వితంతు పెన్షన్ కోసం_* నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భర్త మరణ ధ్రువపత్రం, కుల ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం, భూమి పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, ఒక ఫోటో సమర్పించాలన్నారు.దివ్యాంగుల పెన్షన్ కోసం_* నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, కుల ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం, భూమి పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, ఒక ఫోటో అందించాలన్నారు.ఒంటరి మహిళల పెన్షన్ కోసం* నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విడాకుల ధ్రువపత్రం, కుల ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం, భూమి పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, ఒక ఫోటో సమర్పించాల్సి ఉంటుందన్నారు.కల్లుగీత కార్మికుల పెన్షన్ కోసం* నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కల్లుగీత కార్మికుల ధ్రువపత్రం, కుల ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం, భూమి పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, ఒక ఫోటో సమర్పించాలని సర్పంచ్ తెలిపారు.గతంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించిన వారు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, అయితే నూతన అప్లికేషన్ ఫారం తప్పనిసరిగా జాతపరచాలన్నారు.

ఇల్లంతకుంట గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించగలరని కోరారు

# చట్టపరమైన చిక్కులు అధిగమించి.. శ్రీహరి మృతదేహం

**- టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి చొరవతో మస్కట్ నుంచి స్వదేశానికి తరలింపు**



బలగం టీవీ,గంభీరావుపేట:

ఒమన్-మస్కట్‌లో మృతి చెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన గరిగంటి శ్రీహరి (45) మృతదేహాన్ని తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ కమిటీ చొరవతో స్వగ్రామానికి తరలించారు. చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనప్పటికీ మానవతా దృక్పథంతో అధికారులు, సంబంధిత స్పాన్సర్‌తో సంప్రదింపులు జరిపి మృతదేహం తరలింపునకు టీజీడబ్ల్యూ డబ్ల్యూసి ప్రతినిధులు కృషి చేశారు.

శ్రీహరి గత పదేళ్లుగా ఒమన్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో అత్యవసర సెలవుపై స్వదేశానికి వచ్చి,మూడు నెలల అనంతరం తిరిగి మస్కట్ వెళ్లిన శ్రీహరి , గతంలో పనిచేసిన సంస్థకు సమాచారం ఇవ్వకుండా మరో కంపెనీలో పనిచేయడం ప్రారంభించారు. ఈ పరిస్థితి ఒమన్ చట్టాల ప్రకారం సమస్యగా మారింది.

ఈ క్రమంలో జూలై 29న విధుల్లో ఉండగా శ్రీహరికి తీవ్రంగా చెమటలు పట్టి అస్వస్థతకు గురికాగా,తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశారు.అయితే చట్టపరమైన సమస్యల కారణంగా మృతదేహాన్ని స్వదేశానికి తరలించడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో శ్రీహరి కుటుంబ టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి సభ్యులు మస్కట్ కోఆర్డినేటర్ గోగు దేవరాజును సంప్రదించారు. దేవరాజు విషయాన్ని టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వారు భారత రాయబార కార్యాలయం, సంబంధిత అధికారులు, శ్రీహరి గతంలో పనిచేసిన సంస్థ స్పాన్సర్‌తో సంప్రదింపులు జరిపగా,మానవతా దృక్పథంతో మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు సహకరించాలని స్పాన్సర్‌ను కోరడంతో అవసరమైన పత్రాల ఏర్పాటుకు అధికారులు సహకరించారు. దీంతో శ్రీహరి మృతదేహాన్ని త్వరితగతిన స్వదేశానికి తరలించారు.

హైదరాబాద్ నుంచి ఉచిత అంబులెన్స్

తెలంగాణ సచివాలయంలోని ఎన్ఆర్ఐ విభాగంతో టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి ప్రతినిధులు సంప్రదించి హైదరాబాద్ విమానాశ్రయం నుంచి నర్మాల గ్రామం వరకు మృతదేహాన్ని తరలించేందుకు ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయించారు.

కష్టాల్లో ఉన్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా నిలవడమే టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి లక్ష్యమని పాలాజీ శ్రీనివాస్, గోగు దేవరాజు తెలిపారు. మానవతా దృక్పథంతో బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు.

శ్రీహరి మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు సహకరించిన ప్రభుత్వానికి, టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి

మస్కట్ కోఆర్డినేటర్ గోగు దేవరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్, ఒమన్ శాఖ అధ్యక్షుడు జావుడల సత్తన్నకు శ్రీహరి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కృతజ్ఞతలు తెలిపారు.



# తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్**

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట:

అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ "తల్లి పాలు అనేది బిడ్డకు దేవుడిచ్చిన మొదటి టీకా అని ప్రతి తల్లి తన బిడ్డకు 6 నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలి. అలాగే తల్లులకు మరియు చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం, పోష్టికాహార పదార్థాలను సరిగా అందించాలి. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుంది అని అన్నారు.అంగన్వాడీ టీచర్లు తల్లులకు తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలు, 6 నెలల తర్వాత ఇవ్వాల్సిన అనుబంధ ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి: గజ్జెల దేవరాజ్



**- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొని పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. BRS విద్యార్థి విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జెల దేవరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రధానంగా చర్చించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాలని సమావేశంలో కోరారు. ఇందులో భాగంగా ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 పింఛన్, ఉచిత బస్ పాస్ అందించడంతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సెప్టెంబర్ 17లోపు తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించిన హామీలన్నింటినీ అమలు చేసి, వారికి న్యాయం చేయాలని సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను, భవిష్యత్తును పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశంలో పాల్గొన్న వారు కోరారు.






# కొడుకుపై గొడ్డలితో దాడి.. తండ్రి అరెస్ట్..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తనను తరచూ వేధిస్తూ, కొడుతూ అప్పుల విషయంలో గొడవపడుతున్న కొడుకును హత్య చేసేందుకు ప్రయత్నించిన తండ్రిని కోనరావుపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ తెలిపారు.

కోనరావుపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ మాట్లాడుతూ.. కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కపేట గ్రామానికి చెందిన గుడిపేట రాఘవులు అలియాస్ రాఘవరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారని,కుమారుడు గుడిపేట రాజేందర్ ఎలాంటి పని చేయకుండా తండ్రిని వేధించడంతో పాటు తరచూ కొడుతూ, అప్పులు చెల్లించకుండా గొడవలు చేసేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 8న మధ్యాహ్నం ఫ్యాన్ విషయంలో తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరగగా.. రాజేందర్ తండ్రిపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. దీంతో తీవ్రంగా విసిగిపోయిన రాఘవరెడ్డి, కొడుకు బతికి ఉంటే భవిష్యత్తులో తనకు ఇబ్బందులు తప్పవని భావించి,అదే రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నిద్రిస్తున్న రాజేందర్‌పై గొడ్డలితో దాడి చేసి తల, ముఖంపై నరికాడు. తీవ్రంగా గాయపడిన రాజేందర్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారని అన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి,నిందితుడు రాఘవులు అలియాస్ రాఘవరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించమని తెలిపారు. కేసు దర్యాప్తును త్వరగా పూర్తి చేసిన ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీఐ అభినందించారు.



## స్లిమ్‌గా మారాడు.. స్పిన్‌పై వేట మొదలెట్టాడు!

### టీమిండియాలోకి సర్ఫరాజ్ ఖాన్ రీ-ఎంట్రీ.. సాయి సుదర్శన్ గాయపడటంతో లంక సిరీస్‌కు ఎంపిక.. 18 నెలల్లో 17 కేజీలు తగ్గి సూపర్ ఫిట్‌నెస్!

బలగం టీవీ, హైదరాబాద్

సంచలన బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (Sarfaraz Khan) మళ్లీ టీమిండియా టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. శ్రీలంకతో జరగనున్న ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు బిసిసిఐ సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. యంగ్ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయపడటంతో.. అతడి స్థానంలో సర్ఫరాజ్‌ను జట్టులోకి తీసుకున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. గతంలో భారీ బరువు వల్ల విమర్శలు ఎదుర్కొన్న సర్ఫరాజ్, గడిచిన 18 నెలల కాలంలో కఠినమైన శిక్షణతో ఏకంగా 17 కేజీల బరువు తగ్గి అత్యంత ఫిట్‌గా, హుషారుగా మారడం క్రికెట్ వర్గాలను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వివరాల్లోకి వెళ్తే...

కశ్మీర్ వేదికగా కఠిన కసరత్తులు

ఇటీవల ముంబై టీ20 లీగ్‌లో 'ఆకాశ్ టైగర్స్ వెస్ట్రన్ ముంబై' తరఫున ఆడిన సర్ఫరాజ్, తన మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించాడు. ఆ టోర్నీ ముగిసిన అనంతరం వర్షాకాలం కావడంతో తన ప్రాక్టీస్‌ను కశ్మీర్‌లోని శ్రీనగర్‌కు మార్చేశాడు. అక్కడి 'షేర్-ఇ-కశ్మీర్' స్టేడియంలో నెట్ బౌలర్లతో తీవ్రంగా శ్రమించాడు. ఈ సమయంలోనే తన బ్యాటింగ్ స్కిల్స్‌ను పెంచుకోవడంతో పాటు ఫిట్‌నెస్‌పై పూర్తి ఫోకస్ పెట్టాడు.

"నేను ఇతరుల దృష్టిలో పూర్తి ఫిట్‌గా లేకపోవచ్చు.. కానీ మైదానంలో జట్టు విజయం కోసం అన్ని రకాలుగా పోరాడతాను" అని గతంలో సర్ఫరాజ్ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

స్పిన్‌పై పట్టు.. సెలెక్టర్ల ఓటు!

రంజీ ట్రోఫీలో త్రిశతకం (300+) సాధించిన ఘనత సర్ఫరాజ్ సొంతం. అయితే, 2024లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో జట్టులోని సీనియర్ బ్యాటర్లందరూ విఫలమైనప్పటికీ, వేటు మాత్రం సర్ఫరాజ్‌పైనే పడింది. తిరిగి జట్టులో స్థానం దక్కించుకోవడానికి సర్ఫరాజ్ పట్టుదలతో శ్రమించాడు.

లంకా పర్యటన కోసం రుతురాజ్ గైక్వాడ్, షేక్ రషీద్ పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ.. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొనే బ్యాటర్‌గా సర్ఫరాజ్ నిలిచాడు. మరోవైపు వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ స్పిన్‌ను ఆడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో, లంక పిచ్‌లపై సర్ఫరాజ్ సేవలు ఎంతో కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే లంక సిరీస్‌లో సంపూర్ణ ఫిట్‌నెస్‌తో ఉన్న సర్ఫరాజ్ సత్తా చాటుతాడని అభిమానులు ఆశిస్తున్నారు.



## 'నరేందర్' పేరుపై పాక్ బాక్సర్ కామెంట్స్ వైరల్!

బలగం టీవీ, న్యూఢిల్లీ

కామన్వెల్త్ గేమ్స్‌లో మెరుపులు మెరిపించిన భారత పతక విజేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని '7 లోక్ కల్యాణ్ మార్గ్' ఉన్న తన అధికారిక నివాసంలో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ చిట్‌చాట్‌లో అథ్లెట్లు తమ విజయావకాశాలు, కెరీర్ జర్నీకి సంబంధించిన పలు విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ సమావేశంలో బాక్సర్ నరేందర్ బెర్వాల్ పంచుకున్న ఒక ఆసక్తికర సంఘటన ప్రధాని మోదీతో పాటు అక్కడున్న వారందరినీ నవ్వుల్లో ముంచెత్తింది.

వివరాల్లోకి వెళ్తే... గ్లాస్గో గేమ్స్‌లో పురుషుల 90+ కేజీల బాక్సింగ్ విభాగంలో రజత పతకం సాధించిన హరియాణా బాక్సర్ నరేందర్ బెర్వాల్, 2015 వరల్డ్ మిలటరీ గేమ్స్ నాటి సంఘటనను గుర్తుచేసుకున్నాడు. ఆ పోటీల ఫైనల్లో తాను ఓడించిన ఒక పాకిస్థానీ బాక్సర్‌తో జరిగిన సంభాషణను ప్రధానికి వివరిస్తూ— "నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ దేశ ప్రధాని పేరు కూడా నరేందరే.. నాకు నరేందర్ అనే పేరు అంటేనే అసహ్యం కలిగేలా తయారైంది" అని సదరు పాక్ అథ్లెట్ తనతో అన్నట్లు చెప్పడంతో మోదీ చిరునవ్వులు చిందించారు. ప్రధాని పేరు, ప్రత్యర్థి పేరు ఒకటే కావడంతో ఆ పాక్ అథ్లెట్ అలా తీవ్ర అసహనానికి గురయ్యాడని నరేందర్ బెర్వాల్ సరదాగా వివరించాడు.

పోడియంపై కన్నీళ్లకు కారణం అదే: మీరాబాయి చాను

వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన మీరాబాయి చానును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. పతకం అందుకునే సమయంలో పోడియంపై ఆమె కళ్లంబడి నీళ్లు రావడాన్ని మోదీ ప్రస్తావించగా, మీరాబాయి తీవ్ర భావోద్వేగానికి గురైంది. "పారిస్ ఒలింపిక్స్‌లో పతకం చేజారిన బాధ, గత నాలుగేళ్లుగా గాయాలు, కుటుంబ సమస్యలతో పడ్డ కష్టాలు ఆ క్షణంలో గుర్తొచ్చాయి. పోడియంపై నిలబడి మన జాతీయ జెండా పైకి లేస్తుంటే, జాతీయ గీతం వింటున్నప్పుడు కన్నీళ్లను ఆపుకోలేకపోయాను" అని చాను బదులిచ్చింది. ఆమె కార్చిన ప్రతి కన్నీటి చుక్క నుంచి ఒక స్వర్ణ పతకం జాలువారుతున్నట్లుగా అనిపించిందని మోదీ ప్రశంసించారు.

బాక్సింగ్‌లోనే అత్యధిక పతకాలు!

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ మొత్తం 39 పతకాలు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. అందులో 13 స్వర్ణ, 17 రజత, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ పతకాల పంటలో అత్యధికంగా బాక్సింగ్ విభాగం నుంచే రావడం విశేషం. మన బాక్సర్లు ఏకంగా 7 స్వర్ణాలు, 3 రజత పతకాలతో అగ్రస్థానంలో నిలిచారు.



## వన్డే వరల్డ్ కప్‌కు అఫ్గాన్ డైరెక్ట్ క్వాలిఫై!

### ఐర్లాండ్‌తో మూడో వన్డేలో విజయం..

### 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించిన రషీద్ సేన

బలగం టీవీ, న్యూఢిల్లీ

అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు అరుదైన ఘనత సాధించింది. ఐర్లాండ్‌తో ఇక్కడ జరిగిన మూడో వన్డేలో 3 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని నమోదు చేసి, 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత (Direct Qualification) సాధించింది. ప్రస్తుతం ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో ఉన్న అఫ్గాన్ జట్టు, ఈ విజయంతో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా నిర్వహించనున్న 2027 మెగా టోర్నీకి బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఇది అఫ్గానిస్థాన్‌కు వరల్డ్ కప్‌లో నాల్గో ప్రాతినిధ్యం కానుంది.

బౌలర్లు రాణించినా.. చేజింగ్‌లో ఉత్కంఠ!

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టును అఫ్గాన్ బౌలర్లు కట్టడి చేశారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో ఐర్లాండ్‌ను 46.3 ఓవర్లలో కేవలం 206 పరుగులకే ఆలౌట్ చేశారు. అనంతరం 207 పరుగుల తేలికపాటి లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్ ఒకానొక దశలో 97 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి సునాయాస విజయాల దిశగా పయనించింది. అయితే ఐరిష్ బౌలర్లు విజృంభించడంతో 176 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది.

ఆదుకున్న రషీద్ ఖాన్ ఇన్నింగ్స్

సరిగ్గా ఆ సమయంలో అఫ్గాన్ స్టార్ ఆల్‌రౌండర్ రషీద్ ఖాన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. యమీన్ అహ్మద్‌జాయ్ (4 నాటౌట్; 26 బంతుల్లో) కాపలాదారుగా నిలవగా, రషీద్ ఖాన్ 43 బంతుల్లో 4 ఫోర్లతో అజేయంగా 37 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో అఫ్గానిస్థాన్ 44.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ఐదు వన్డేల సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షార్పణం కాగా, రెండో వన్డేలో 92 పరుగుల తేడాతో గెలిచిన అఫ్గాన్.. ఈ మూడో వన్డే విజయంతో వన్డే ప్రపంచకప్ అర్హతను అధికారికంగా ఖరారు చేసుకుంది.

# కామన్‌వెల్త్ ఫెన్సింగ్‌లో భారత జోరు

### 17 పతకాలతో అదరగొట్టిన యువ అథ్లెట్లు!

### 4 స్వర్ణాలు, 4 రజతాలు, 9 కాంస్యాలు సొంతం..

### నైజీరియా వేదికగా ఆధిపత్యం చాటిన భారత ఫెన్సర్లు

బలగం టీవీ, హైదరాబాద్



నైజీరియాలోని లాగోస్ వేదికగా జరుగుతున్న యు-23 (U-23) కామన్‌వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యంగ్ అథ్లెట్లు ఘన విజయాన్ని నమోదు చేశారు. టోర్నీ ఆరంభంలోనే పురుషులు, మహిళల విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ఏకంగా 17 పతకాలు తమ ఖాతాలో వేసుకున్నారు. ఇందులో 4 స్వర్ణాలు (Gold), 4 రజతాలు (Silver), 9 కాంస్య (Bronze) పతకాలు ఉన్నాయి.

అన్ని విభాగాల్లోనూ మెరిసిన భారత్

ఆగస్టు 14 వరకు జరగనున్న ఈ పోటీలలో ప్రతి విభాగంలోనూ కనీసం ఒక భారత అథ్లెట్ అయినా పోడియంపై నిలిచినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. సేబర్, ఫాయిల్, ఎపీ విభాగాల్లో మన అథ్లెట్లు పతకాల పంట పండించారు.

పురుషుల విభాగంలో విజేతలు:

సేబర్ (Sabre): నిఖిల్ వాఘ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా, లక్షయ్ బద్సేర్ రజతం గెలుచుకున్నాడు. అశ్విని ఆర్య, లైశ్రామ్ మొరంబా కాంస్య పతకాలు సాధించారు.

ఫాయిల్ (Foil): తేజస్ పాటిల్ రజతం దక్కించుకోగా, హేమాష్ సనాసమ్ కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు.

ఎపీ (Epee): లోకేష్ వేమని రజత పతకాన్ని సాధించగా, శౌర్య అశ్విని, గాడ్విన్ అన్నకేన్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

మహిళల విభాగంలో ఆధిపత్యం:

ఫాయిల్ (Foil): జాయ్స్ అషిత పసిడి పతకంతో మెరవగా, సహచర క్రీడాకారిణి కనగలక్ష్మి రజతం సాధించింది.

ఎపీ (Epee): ప్రాచి లోహన్ స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా.. నివేద్య నాయర్, అనుప్రియలకు కాంస్యాలు లభించాయి.

సేబర్ (Sabre): జెఫర్లిన్ స్వర్ణం దక్కించుకోగా, ఆఖరి రజతం సాధించింది. శ్రేయ గుప్తా కాంస్యంతో మెరిసింది.

"భారత అథ్లెట్లు, కోచ్‌లు మరియు సహాయక సిబ్బంది చూపిన అంకితభావానికి, శ్రమకు నా హృదయపూర్వక అభినందనలు."

— రాజీవ్ మెహతా, సెక్రటరీ జనరల్ (ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా)

# కామన్‌వెల్త్ గేమ్స్ విజేతలతో ప్రధాని ఆత్మీయ సమావేశం!



### లవ్లీనాకు ప్రశంసలు.. మీరాబాయికి లడ్డూ తినిపించిన పిఎం

బలగం టీవీ, న్యూఢిల్లీ

కామన్‌వెల్త్ గేమ్స్ (CWG)లో పతకాలతో దేశ కీర్తిపతాకను ఎగురవేసిన భారత క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక నివాసంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఆత్మీయ భేటీలో క్రీడాకారులు తమ గెలుపు అనుభవాలను, ఎదుర్కొన్న సవాళ్లను ప్రధానితో పంచుకున్నారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, సహాయ మంత్రి రక్షా ఖడ్సే, ఐఓఏ (IOA) అధ్యక్షురాలు పి.టి. ఉష కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

దేశభక్తి చాటుకున్న లవ్లీనాకు ప్రశంసలు

75 కేజీల విభాగంలో రజత పతకం సాధించిన అసోమ్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్‌ను ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. కామన్‌వెల్త్ గేమ్స్ ముగింపు రోజున ఒక రెస్టారెంట్‌లో తప్పుగా (డిస్టార్టెడ్) ఉన్న భారత పటాన్ని గమనించి, వెంటనే రెస్టారెంట్ నిర్వాహకులతో మాట్లాడి సరిచేయించిన లవ్లీనా చొరవను మోదీ కొనియాడారు. "విజయోత్సవంలో ఉన్న సమయంలో కూడా దేశ పటం ప్రాముఖ్యతను గుర్తించడం సాధారణ విషయం కాదు, ఈ ఘటన దేశ ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది" అని ప్రధాని ప్రశంసించారు.

మీరాబాయి చానూకు లడ్డూ తినిపించిన మోదీ

48 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో గెలుచుకున్న స్వర్ణ పతకంతో పాటు, పోడియంపై భావోద్వేగానికి గురైన మీరాబాయి చానూ అనుభవాలను మోదీ అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా గాయాలు, కుటుంబ సమస్యలతో పడిన వేదనను, పారిస్ ఒలింపిక్స్‌లో తృణప్రాయంలో పతకం చేజారిన బాధను దాటుకొని మళ్లీ జాతీయ గీతం వస్తుంటే ఆనందభాష్పాలు ఆగలేదని మీరాబాయి వివరించింది. ఈ సందర్భంగా ప్రధాని స్వయంగా మీరాబాయికి లడ్డూ తినిపించి అభినందనలు తెలిపారు.

నరేంద్ర పేరుపై పాకిస్థాన్ బాక్సర్ సరదా వ్యాఖ్య

+90 కేజీల విభాగంలో స్వర్ణం సాధించిన బాక్సర్ నరేందర్ బెర్వాల్ ఒక సరదా సంఘటనను ప్రధానితో పంచుకున్నాడు. 2015 మిలిటరీ వరల్డ్ గేమ్స్‌లో ఒక పాకిస్థానీ బాక్సర్‌ను ఓడించిన తర్వాత, సదరు బాక్సర్ స్పందిస్తూ— "నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ ప్రధాని పేరు కూడా నరేందరే.. నాకు ఈ పేరు అంటేనే భయం వేస్తోంది" అని అన్నట్లు బెర్వాల్ గుర్తుచేసుకోగా ప్రధాని మోదీ చిరునవ్వులు చిందించారు.

కార్గిల్ విజయ్ దివస్ వేళ బాక్సర్ జాదుమణి ఘనత

జూలై 26న (కార్గిల్ విజయ్ దివస్) పాకిస్థాన్ బాక్సర్‌ను ఓడించి తన పతకాన్ని భారత సాయుధ దళాలకు అంకితమిచ్చిన బాక్సర్, భారత ఆర్మీ జవాన్ జాదుమణి సింగ్ (55 కేజీలు) ను కూడా ప్రధాని అభినందించారు. "సరిగ్గా ఓడించాల్సిన వ్యక్తినే ఓడించి మన విజయాన్ని మరింత పవిత్రం చేశావ్" అని మోదీ అన్నారు.

# టీమిండియాను వెంటాడుతున్న గాయాల బెడద!

### బుమ్రా సహా కీలక ఆటగాళ్లకు వరుస గాయాలు..

### సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై విమర్శలు

### సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కేవలం గాయపడిన ఆటగాళ్లకు చికిత్స అందించే రిహాబ్ సెంటర్‌గా చూడొద్దు : సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్

బలగం టీవీ, న్యూఢిల్లీ



భారత క్రికెట్ జట్టును గాయాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కీలక సిరీస్‌లు, టోర్నీలకు ముందు ప్రధాన ఆటగాళ్లు వరుసగా గాయాల బారిన పడుతుండటం జట్టు యాజమాన్యాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆటగాళ్లకు నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ పరీక్షలు, రిహాబిలిటేషన్ ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆటగాళ్లు కోలుకునే సమయం విషయంలో స్పోర్ట్స్ సైన్స్ విభాగం, సెలెక్టర్ల మధ్య సమన్వయ లోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందించారు. గాయాలు ప్రొఫెషనల్ క్రికెట్‌లో సహజమేనని, ఒకరిపై నిందలు వేయడం కంటే ఆటగాళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ సరైన రిహాబిలిటేషన్ అందించడమే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

రిహాబ్ సెంటర్ మాత్రమే కాదు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కేవలం గాయపడిన ఆటగాళ్లకు చికిత్స అందించే రిహాబ్ సెంటర్‌గా చూడొద్దని లక్ష్మణ్ అన్నారు. ఆటగాళ్లు తమ కెరీర్‌లో అత్యుత్తమ స్థాయికి చేరుకునేలా వారి ఫిట్‌నెస్, ప్రదర్శనను మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. గాయాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాదని, గాయపడిన తర్వాత ఆటగాళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

బుమ్రా విషయంలో మారిన అంచనాలు

ప్రస్తుతం జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి తదితర ఆటగాళ్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్నారు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న కీలక టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం కావడం భారత జట్టుకు ఎదురుదెబ్బగా మారింది. తొలుత కనీసం ఒక టెస్టులోనైనా అతను అందుబాటులో ఉంటాడని సెలెక్టర్లు భావించినప్పటికీ.. మోకాలిలో ద్రవం చేరడంతో అతని రిహాబిలిటేషన్ సమయం పెరిగినట్లు తెలుస్తోంది.ఈ పరిణామాలపై జాతీయ ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్‌తో లక్ష్మణ్ వర్చువల్‌గా సమావేశమై పరిస్థితులను వివరించినట్లు సమాచారం.

మళ్లీ గాయపడిన హర్షిత్

యువ పేసర్ హర్షిత్ రాణా పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. తొడ కండరాల గాయంతో సుమారు నాలుగు నెలలు ఆటకు దూరమైన అతను తిరిగి వచ్చిన కొద్ది రోజులకే అదే గాయంతో మళ్లీ జట్టుకు దూరమయ్యాడు. దీంతో అతనికి పూర్తి స్థాయిలో కోలుకోకముందే క్లియరెన్స్ ఇచ్చారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్ వేగాన్ని పెంచే ప్రయత్నంలో తొడ కండరాలపై అధిక ఒత్తిడికి గురై గాయపడ్డాడు. సాయి సుదర్శన్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పటికీ ఎడమ కాలి బొటనవేలి నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్ తదితరులు కూడా వివిధ ఫిట్‌నెస్ సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

స్పోర్ట్స్ సైన్స్ విభాగానికి శాశ్వత హెడ్ ఏది?

ఈ సమావేశంలో ప్రధానంగా వినిపించిన ప్రశ్న— భారత ఆటగాళ్లు ఎందుకు తరచుగా గాయపడుతున్నారు? వారు కోలుకోవడానికి ఎందుకు ఎక్కువ సమయం పడుతోంది? దీనికి సమాధానమిస్తూ లక్ష్మణ్ ఒక కీలక విషయాన్ని అంగీకరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోని 'స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్' (SSM) విభాగాధిపతి పదవి గత 18 నెలలుగా (ఒకటిన్నర సంవత్సరాలుగా) ఖాళీగానే ఉందని తెలిపారు. 2025 ప్రారంభంలో నితిన్ పటేల్ తన పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు బోర్డు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ సరైన అభ్యర్థి లభించలేదని వివరించారు.

ముగ్గురు నిపుణులు నిరాకరించడంతో నియామకం వాయిదా

ఈ పదవికి సంబంధించి ఒక నిపుణుల బృందంతో కలిసి పలువురు ప్రముఖులను సంప్రదించినట్లు లక్ష్మణ్ తెలిపారు:

ఆండ్రూ లీపస్ (మాజీ టీమిండియా ఫిజియో): గతంలో భారత జట్టుకు విశేష సేవలందించిన ఆండ్రూ లీపస్‌ను సంప్రదించగా, ఆయన కుటుంబ కారణాల వల్ల ఈ ఆఫర్‌ను స్వీకరించడానికి నిరాకరించారు.

ఆస్ట్రేలియన్ నిపుణుడు: ఆస్ట్రేలియాకు చెందిన ఒక ప్రముఖ స్పోర్ట్స్ సైంటిస్ట్‌తో ఒప్పందం దాదాపు ఖరారైనప్పటికీ, ఆయన బెంగళూరుకు తన నివాసాన్ని మార్చుకోవడానికి (రిలోకేషన్) సుముఖత చూపలేదు.

న్యూజిలాండ్ రగ్బీ టీమ్ ఎక్స్‌పర్ట్: న్యూజిలాండ్ రగ్బీ జట్టుకు సుదీర్ఘ అనుభవం ఉన్న మరొక నిపుణుడిని కూడా పరిశీలించగా, ఆయన చివరి నిమిషంలో ఈ ప్రతిపాదనను తిరస్కరించారు.

ఎవరినీ బలిపశువును చేయకండి: లక్ష్మణ్ విజ్ఞప్తి

ఆటగాళ్లు గాయపడిన ప్రతిసారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై ఆరోపణలు చేయడం లేదా ఎవరినో ఒకరిని బలిపశువును చేసేలా 'బ్లేమ్' అనే పదాన్ని వాడటం సరికాదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. "సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ సైన్స్ బృందం, సెలెక్షన్ కమిటీల మధ్య అద్భుతమైన సమన్వయం ఉంది. ప్రతి ఆటగాడి ఫిట్‌నెస్ స్థితిని అత్యంత పారదర్శకంగా సెలెక్టర్లకు నివేదిస్తున్నాం. ఆటగాడి రికవరీ ఆశించిన స్థాయిలో లేకపోతే వెంటనే హెడ్ కోచ్, సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌కు సమాచారం అందుతుంది" అని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

# డ్యూరాండ్ కప్ క్వార్టర్స్‌కు మోహన్ బగాన్, స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ!

### సీఐఎస్ఎఫ్‌పై 6-0తో విజృంభించిన మోహన్ బగాన్..

### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌పై 7-1తో ఢిల్లీ విజయం

బలగం టీవీ, న్యూఢిల్లీ



ప్రతిష్ఠాత్మక 135వ డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ (MBSG), స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టాయి. సోమవారం జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌ల్లో ఈ రెండు జట్లు ప్రత్యర్థులపై భారీ విజయాలతో నాకౌట్ బెర్త్‌లను సొంతం చేసుకున్నాయి.

వివరాల్లోకి వెళ్తే...సహల్ హ్యాట్రిక్.. 6-0తో మోహన్ బగాన్ ఘనవిజయం

కోల్‌కతాలో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో మోహన్ బగాన్ 6-0 తేడాతో సిఐఎస్ఎఫ్ (CISF) ప్రొటెక్టర్స్ జట్టును ఘోరంగా ఓడించింది. మోహన్ బగాన్ స్టార్ ప్లేయర్ సహల్ అబ్దుల్ సమద్ మొదటి సగంలోనే హ్యాట్రిక్ గోల్స్ (17వ, 19వ, 37వ నిమిషాల్లో) సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మిగతా గోల్స్‌ను మన్వీర్ సింగ్ (24వ నిమిషం), జేమీ మెక్లారెన్ (68వ నిమిషం), టెక్చామ్ అభిషేక్ సింగ్ (73వ నిమిషం) నమోదు చేశారు.

ఆరంభం నుంచే మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన మోహన్ బగాన్ తొలి సగంలో ఏకంగా 75 శాతం బంతిని తమ వద్దే ఉంచుకుని 4-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ విజయంతో గ్రూప్-ఎ లో ఆడిన మూడింటిలోనూ గెలిచి 9 పాయింట్లతో మోహన్ బగాన్ అగ్రస్థానంలో నిలవగా, సిఐఎస్ఎఫ్ ఒక్క పాయింట్ కూడా సాధించకుండా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

7-1తో ఎయిర్‌ఫోర్స్‌ను చిత్తు చేసిన స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ

రాంచీలోని బిర్సా ముండా స్టేడియంలో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ 7-1 తేడాతో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జట్టును ఘోరంగా ఓడించి నాకౌట్ దశకు చేరుకుంది. ఢిల్లీ జట్టు తరఫున రోడ్రిగుయిస్లో (11వ నిమిషం), జువాన్ సెబాస్టియన్ పెనా (39వ, 65వ నిమిషాలు), దువాన్ మీనా (55వ నిమిషం), లాల్‌రిన్‌లియానా హ్నామ్‌తే (63వ నిమిషం), క్లారెన్స్ శావియో ఫెర్నాండెజ్ (79వ నిమిషం), రిచర్డ్ ఎన్‌డాయిషిమియే (90+4 నిమిషం) గోల్స్ చేశారు.

ఎయిర్‌ఫోర్స్ తరఫున శామ్యూల్ కె వన్‌లాల్‌పేకా (50వ నిమిషం) ఏకైక గోల్ సాధించాడు. ఈ విజయంతో స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ కూడా గ్రూప్ దశలో మూడుకు మూడు మ్యాచ్‌లూ గెలిచి 9 పాయింట్లతో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది.

# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల




నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.
విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# CINEMA





## మహేశ్ బాబు ఎఐ వీడియో షేర్ చేసి వంగా

కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్
ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

## టాక్సిక్‌ను సక్సెస్‌ఫుల్‌గా తీసి చూపా




'టాక్సిక్' ప్రారంభించినప్పుడు చాలా మంది 'నీ వల్ల కాదు' అన్నారని అలాంటివాళ్లకు చిత్రం పూర్తి చేసి తన సత్తా చూపించానని దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఎమోషనల్ అయ్యారు. ఆమె దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ ఈవెంట్‌లో దర్శకురాలు మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు చాలా మంది తనను ఎన్నో మాటలు అన్నారని గుర్తుచేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి.. ఈ సినిమాను అంగీకరించినందుకు యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

## హుషారు పిట్టలు ట్రైలర్ విడుదల



అన్షు, వాసవి గణెళిశన్ జంటగా రూపొందిన చిత్రం 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకుడు. వెంకట్ యాదవ్ నిర్మాత. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు 'ఏ ప్రేమ కావాలి.. కన్నవాళ్లదా.. ప్రేమించిన వాళ్లదా..' అనే డైలాగులు యూత్‌ను ఆలోచింపచేస్తున్నాయి.

# వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్ ?




దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్‌ఆర్‌ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో



చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.

## అభిమానికి చిరంజీవి అభినందనలు



మెగాస్టార్ చిరంజీవికి తన అభిమానులంటే ఎంతటి ప్రేమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అభిమానులనే తన కుటుంబంగా భావించే ఆయన.. అవకాశం వచ్చిన ప్రతిసారీ వారి పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా 'మెగా 158' షూటింగ్ సెట్స్‌లో జరిగిన ఓ అరుదైన, హృదయాన్ని హత్తుకునే సంఘటన ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'మెగా 158' షూటింగ్ సమయంలో కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్ మెగాస్టార్ చిరంజీవి దృష్టిని ఆకర్షించాడు. ఆయన పనితీరును గమనించిన చిరంజీవి.. నివాస్‌తో సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతడి వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడు నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని చెప్పడంతో పాటు.. చరణ్‌పై ఉన్న అభిమానంతో తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అనే పేరు పెట్టినట్లు చిరంజీవికి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించడమే కాకుండా.. తన కుటుంబంపై ఓ సాధారణ టెక్నీషియన్ చూపిస్తున్న అభిమానానికి భావోద్వేగానికి గురైనట్లు తెలుస్తోంది. అంతటితో ఆగకుండా చిరంజీవి నివాస్ కుటుంబాన్ని తన ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. మెగాస్టార్ నుంచి వచ్చిన ఈ ఆహ్వానం ఆ కుటుంబానికి ఊహించని ఆనందాన్ని కలిగించింది. చిరంజీవి ఆహ్వానం మేరకు నివాస్ తన కుటుంబంతో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి మరో మధురమైన సర్‌ప్రైజ్ ఎదురైంది. మెగాస్టార్‌తో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా నివాస్ కుటుంబ సభ్యులతో కొంత సమయం గడిపారు. చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ ఆప్యాయంగా మాట్లాడారు. నివాస్ కుటుంబ సభ్యులతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలు దిగారు. మెగా ఫ్యామిలీతో గడిపిన ఈ అరుదైన క్షణాలు ఆ అభిమాని కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మారాయి. ఓ సాధారణ టెక్నీషియన్ కుటుంబానికి చిరంజీవి, రామ్ చరణ్ ఇచ్చిన గౌరవం, చూపించిన ఆత్మీయత ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం






యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది.